

కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం..

కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యంతో చారిత్రక ఖిలావరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో స్వాత్రంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరలేదు. - 8లో▸



కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి - 9లో▸

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు సుధాకర్ డిమాండ్

గరిష్టం/కనిష్టం
$31^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణ పరిస్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉండి, రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ



భూపాలపల్లి అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశభక్తుల ప్రాణత్యాగం వల్లే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఏఓ మహేష్‌బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దేశసేవకు పునరంకితం కావాలి



భూపాలపల్లి: ప్రతీ పౌరుడు దేశ సేవకు పునరంకితం కావాలని ఎస్పీ పుల్లా కరుణాకర్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జాతీయ జెండాను ఆవిష్కరించి జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వేచ్ఛ కల్పించిన త్యాగధనులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామోజు రమేష్, ఏఆర్ అదనపు ఎస్పీ వి.శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ రాములు, డీపీఓ అధికారులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని మంజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధులను గుర్తుచేసుకున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



భూపాలపల్లి రూరల్: వరద బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రవీందర్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రొఫెసర్లు మంగళవారం మోరంచపల్లి గ్రామంలో పర్యటించారు. నలుగురు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. 20 చెంచు కుటుంబాలకు దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లకిడె కమలబాయి–వెంకన్న, రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎర్రగట్టు స్వామి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని లారీ అసోసియేషన్ సమీపంలోని శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం ఇన్‌చార్జ్ లతాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు రెండు గేట్ల తాళాలు పగులకొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోని అమ్మవారి మెడలోని మంగళసూత్రం, బీరువాలోని వెండి ఆభరణాలు, హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లారు. సుమారు రూ.40వేల విలువగల వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

ఏటూరునాగారం: మండల పరిధిలోని చెల్పాక (రొయ్యూర్) పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా క్లినిక్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యురాలు సుమలత తెలిపారు. 8 రకాల పరీక్షలు చేసి వారికి అవగాహన కల్పించినట్లు వివరించారు. సమస్యలను వెంటనే గుర్తించి చికిత్స పొందితే వారి ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు.

పరిపాలన సౌలభ్యం మెరుగు

కొత్త మండలంగా గోరికొత్తపల్లి, సబ్ రిజిస్ట్రార్, కార్మిక శాఖ కార్యాలయాలు

- సంక్షేమ పథకాలతో పేదల అభివృద్ధి
- విద్య, వైద్య రంగానికి భారీగా నిధులు
- వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దపీట
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి




జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి, జాతీయ పతాకానికి వందనం చేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ భవేష్‌మిశ్రా



వేడుకల్లో ప్రసంగిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి: ప్రజలకు పరిపాలన సౌలభ్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

దేశానికే తలమానికంగా, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వం అనేక వినూత్నమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా గోరికొత్తపల్లిని మండలం చేయడమేకాక పలు కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. జిల్లాకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సహాయక కార్మిక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశాం.

అన్నదాతలకు అండగా..

రైతు బంధు పథకం ద్వారా ఈ వానాకాలం 2023లో ఇప్పటి వరకు రూ. 1,06,574 మంది రైతులకు రూ. 112.47 కోట్ల నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. జిల్లాలోని 76,837మంది రైతులకు ప్రభుత్వం రైతు బీమా చేయించాం. 2022–23 సంవత్సరంలో జిల్లాలో మరణించిన 286 రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాం. జిల్లాలో మార్చి నెలలో కురిసిన వర్షాలకు 2,115 ఎకరాలలో పంట నష్టం జరుగగా పరిహారం కింద రూ. 2కోట్ల 11లక్షల 59వేలు రైతుల ఖాతాలో జమ చేశాం. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్ష రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి దఫాలో లక్ష రూపాయల రుణమాఫీ ప్రక్రియ ప్రభుత్వం పూర్తి చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని 60,601 మంది రైతుల రూ. 360.28 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా రైతులకు అధిక లాభం కలుగుతుందని జిల్లాలో 340 హెక్టార్లలో 287మంది రైతులకు రూ.3కోట్ల 57లక్షల వ్యయంతో లబ్ధి చేకూర్చాం.

గొల్లకురుమల కోసం..

జిల్లాలో రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఇప్పటివరకు 48మంది లబ్ధిదారులకు రూ.84కోట్ల వ్యయంతో 75శాతం సబ్సిడీపై గొర్రెల యూనిట్లు అందించాం. జిల్లాలోని 30 పశు వైద్యశాలల ద్వారా పాడి పశువులకు అవసరమైన వైద్య సేవలు, వ్యాధి నివారణ టీకాలు చేపట్టాం.

దళితుల అభివృద్ధికి..

దళిత సాధికారత పేరుతో దళిత బంధు పథకానికి నిధులు కేటాయించాం. జిల్లాలో 151 యూనిట్లకు రూ.10లక్షల చొప్పున రూ. 15.10 కోట్లు మంజూరు చేశాం. దళిత బంధు పథకం రెండవ దశలో భాగంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 1,100 యూనిట్లు మంజూరు చేశాం. భూమిలేని దళిత వ్యవసాయ ఆధారిత కుటుంబాల మహిళలకు మూడెకరాల భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 91మంది లబ్ధిదారులకు రూ.8.58కోట్ల వ్యయంతో 124 ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేశాం.

అటవీశాఖ ఆధ్వర్యంలో..

హరితహారం కార్యక్రమం ద్వారా జిల్లాలో 2023–24 సంవత్సరంలో 27.33 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 19 లక్షల మొక్కలు నాటాం. పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నిరుపేద షెడ్యూల్ తెగల కుటుంబాలకు చెందిన 3,210మంది రైతులకు 7,893 ఎకరాల పోడు పట్టా పాసుపుస్తకాలు పంపిణీ చేశాం.

విద్య, వైద్యరంగంలో ముందడుగు..

విద్య, వైద్యరంగంలో గతంలో కంటే జిల్లా ముందంజలో ఉంది. ఏప్రిల్ 2023 మాసం నుంచి ఇప్పటివరకు 1,628 ప్రసవాలు జరుగగా వారికి కేసీఆర్ కిట్లు పంపిణీ చేశాం. గర్భిణులు మహిళల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం జిల్లాలో నూతనంగా కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలోని గర్భిణులకు రెండు సార్లు 5,072 కిట్లను అందించాం. జిల్లాలో 108 అంబులెన్స్‌ల ద్వారా 3,737మందికి అత్యవసర సేవలు, 102 అమ్మ ఒడి వాహనాల ద్వారా 9,264 మంది గర్భిణులు, బాలింతలకు సేవలు అందించాం. జిల్లా కేంద్రంలో తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 12,122మందికి వైద్య పరీక్షలు నిర్వహించాం. జిల్లా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్, మహదేవపూర్, చిట్యాల సీహెచ్‌సీల్లో బ్లడ్ స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేశాం. జిల్లాలో కు ప్రభుత్వం నూతన మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహిస్తాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం రూపొందించిన మన ఊరు–మన బడి పథకం కింద జిల్లాలో మొదటిదశలో 149 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను చేపట్టాం. ప్రభుత్వ పరిధిలో నడుస్తున్న పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు అల్పాహారంగా రాగి జావ పంపిణీ చేస్తున్నాం.

మహిళ, శిశు సంక్షేమానికి ప్రాధాన్యత..

మహిళలకు ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా జిల్లాలోని 644 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 4,806మంది గర్భిణులు, బాలింతలకు, ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాలలోపు వయసు గల 22,247మంది పిల్లలకు పౌష్టికాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నాం. అర్హులైన దివ్యాంగులకు 70 బ్యాటరీ ట్రై సైకిళ్లు, కృత్రిమ కాళ్లు, ఇతర పరికరాలను అందించాం. సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద 100 బాల్య వివాహాలను, ఐదు అక్రమ దత్తతను అధికారులు ఆపారు. స్పాన్సర్‌షిప్ పథకం కింద 111 పిల్లలను ఎంపికచేసి ప్రతి నెలా రూ.2వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నాం.

పట్టణంలో అభివృద్ధి పనులు..

భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో వంద పడకల ఆస్పత్రి పక్కన గల ఖాళీ స్థలంలో రూ.40లక్షల వ్యయంతో ఆక్యుపంచర్ పార్కు నిర్మించాం. 42.5 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్‌తో బృహత్ పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేశాం.

రహదారులు, భవనాల నిర్మాణం..

రహదారులు, భవనాల శాఖ ద్వారా రూ.276.26 కోట్ల అంచనా వ్యయంతో 40 పనులు చేపట్టగా రూ.179.17 కోట్ల విలువ గల 18 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నవి. జిల్లా సమీకృత కలెక్టరేట్ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధగా ఉంది.

వీఆర్ఏల రెగ్యులరైజేషన్..

వీఆర్ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో వీఆర్ఏలుగా పనిచేస్తున్న 323 మందికి రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ శాఖలలో భర్తీ చేశాం.

ఊహించని విపత్తును ఎదుర్కొన్నాం..

గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకరోజు రాత్రి అత్యధికంగా 600 సెంటీమీటర్ల వర్షపాతం కురిసిన కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరద ప్రవాహానికి మోరంచపల్లి గ్రామం నీట మునిగింది, ఎవరూ ఊహించని ఘటనకు జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టింది. ప్రమాదాల సమయంలో సత్వరమే స్పందించేందుకు జిల్లాలో 20మంది పోలీసులకు శిక్షణ అందించి డిజాస్టర్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీరికి స్పీడ్ బోట్లు, అవసర మైన ఇతర పరికరాలు అందుబాటులో ఉంచాం.

సంక్షేమానికి పెద్దపీట..

బీడీ కార్మికులు, ఎయిడ్స్, ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు రూ.2,016, దివ్యాంగులకు జూలై నుంచి రూ.4,016 చొప్పున 57,939 మందికి ఆసరా పెన్షన్ పథకం కింద ప్రతీ మాసం రూ.13.04కోట్లు చెల్లిస్తున్నాం. మహిళలు ఆర్థికంగా స్వయం వృద్ధి సాధించేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఇప్పటివరకు 871 స్వశక్తి సంఘాలకు స్త్రీ నిధి ద్వారా రూ.61.26 కోట్లు, 354 సంఘాలకు రూ.2.65 కోట్లు బ్యాంకు రుణాలు అందేలా చూశాం.




సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్న అధికారులు



అవార్డు అందుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



డీపీఓ ఆశాలత



సీఐ రాంనర్సింహారెడ్డి



ఎస్సై నరేష్



ఆర్ఐ ప్రదీప్‌కుమార్

భూపాలపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదల్లో ధైర్య సాహసాలతో బాధితులకు సేవలు అందించిన, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు చేసిన జిల్లాలోని ఐదుగురు అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీపీఓ ఆశాలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి, కొయ్యూరు ఎస్సై నరేష్ ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ఘనంగా వేడుకలు



మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్ రెడ్డి

భూపాలపల్లి రూరల్: 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలో అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఉదయం 11.05గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ పెరేడ్‌లో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. 11.13 నిమిషాల నుంచి 11.42 నిమిషాల వరకు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉద్యోగ నిర్వహణలో తమ బాధ్యతలను నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన జిల్లాలోని 150మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో పాటు అవార్డులు ప్రదానం చేశారు. పార్థివదేహాలను తీసుకెళ్లే వాహనంతో పాటు, ఆరు 108 వాహనాలు, రెండు అమ్మ ఒడి అంబులెన్స్‌లను ప్రారంభించారు. మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలు అందించారు. అర్హులైన జూనియర్ పంచాయతీ సెక్రటరీలను రెగ్యులర్ చేసి నియామక పత్రాలు అందించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ సెర్ప్– హెల్ప్ పథకం ద్వారా 42 మహిళా సంఘాలకు రూ.12కోట్ల 50 లక్షలు రుణాల చెక్కులు అందించారు. ట్రాన్స్‌జెండర్లు ఆత్మభిమానంతో జీవించాలని.. వ్యాపారాలు చేసుకోవాలని వారికి రుణాలకు సంబంధించిన చెక్కులు అందించారు. లబ్ధిదారులకు రెండవ విడత గొర్రెల పంపిణీకి సంబంధించిన పత్రాలు అందించారు. కార్మిక శాఖలో దరఖాస్తులు చేసుకున్న వారికి ఈశ్రామ్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రమేష్ గౌడ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏరియాను లాభాల్లోకి తీసుకురావాలి

సింగరేణి జీఎం శ్రీనివాసరావు



జెండా ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేస్తున్న జీఎం శ్రీనివాసరావు


భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాకు ఉజ్వల భవిష్యత్ ఉందని ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాను లాభాల్లోకి తీసుకురావాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు కోరారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఏరియాలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం సుభాష్‌కాలనీ మిలీనియం క్వార్టర్స్‌లోని క్రీడా మైదానంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించి వేడుకలను జీఎం ప్రారంభించారు. ఏరియాలో ఉత్తమ ప్రతిభకనబర్చిన సింగరేణి కార్మికులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. ఎందరో మహనీయుల ప్రేరణతో భారత జాతి ఒకే తాటిపై నిలిచి, స్వాతంత్ర్య పొందిన అతి పెద్ద ప్రజాస్వామ దేశమన్నారు. మహనీయుల త్యాగాలను స్మరిస్తూ దేశవ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. 134 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో అనేక దశల్లో నూతన సంస్కరణలు చోటుచేసుకున్నట్లు తెలిపారు. 1990సంవత్సరం తరువాత వేగంగా మార్పులు జరిగాయన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆదేశాలలో సీఎండీ శ్రీధర్ నేతృత్వంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం, సంక్షేమ కార్యక్రమాల అమలులో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తున్నామన్నారు. దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియా ఉత్పత్తి లక్ష్యం78 లక్షల టన్నుల సాధించాల్సి ఉందన్నారు. గడిచిన మూడు నెలల్లో 23.89 లక్షల టన్నులు వెలికితీయాల్సి ఉండగా 23.42లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. అధిక వర్షం కారణంగా ఓపెన్‌కాస్టు 2,3 ప్రాజెక్ట్‌లో అనుకున్న స్థాయిలో ఉత్పత్తిని సాధించలేకపోయినట్లు తెలిపారు. దీంతో ఇప్పటివరకు రూ.45.42కోట్ల నష్టాల్లో ఉన్నట్లు వివరించారు. భూగర్భగనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాల పని విధానం మెరుగుపడాల్సిన అవసరముందన్నారు. యంత్రాల పనితీరు, కార్మికుల గైర్హాజరు శాతం నైపుణ్యం కలిగి కార్మికులు ఉద్యోగ విరమణ చేయడం వలన బొగ్గు ఉత్పత్తిని సాధించలేకపోతున్నట్లు తెలిపారు. ఏరియాలో ఇప్పటి వరకు 1,165మందికి కారుణ్య నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. మంజూర్‌నగర్ ప్రాంతంలో 994 డబుల్ బెడ్‌రూం క్వార్టర్ల నిర్మాణం పనులు పూర్తిచేసి కార్మికులకు అందించినట్లు తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కోర్సులతో పాటు యువతకు మోటార్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ వేడుకల్లో ఎస్ఓటు జీఎం వెంకటయ్య, అధికారులు జాకీర్ హుస్సేన్, వెంకటరామిరెడ్డి, జోతి, రవికుమార్, రామకృష్ణారెడ్డి, పద్మజ, కార్మిక సంఘాల నాయకులు సమ్మయ్య, రమేష్, రాజయ్య, బుచ్చయ్య, సేవాసభ్యులు పాల్గొన్నారు.



వేడుకల్లో మాట్లాడుతున్న జీఎం



అవార్డు అందుకుంటున్న కోఆర్డినేటర్



ఉత్తమ కార్మికులుగా అవార్డులు అందుకున్న ఉద్యోగులతో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



మౌత్‌వాష్, పేస్టులు అందజేస్తున్న డాక్టర్ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ విజయటాకీస్ రోడ్డులోని ఎస్‌వీఎస్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గిరిధర్‌రెడ్డి పాల్గొని పలువురికి పరీక్షలు చేశారు. ఉచితంగా పేస్టులు, మౌత్‌వాష్‌లు, మందులు పంపిణీ చేశారు. దంత సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అలరించిన ఆర్య నాటిక



నాటికలోని ఓ సన్నివేశం

హన్మకొండ కల్చరల్ : 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ ఓరుగల్లు శారదా నాట్యమండలి ఆధ్వర్యంలో సోల్జర్ షఫీ మహమ్మద్ రచించి దర్శకత్వం చేసిన ఫ్రీడమ్ ఫైటర్ నీరా ఆర్య నాటిక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మంగళవారం రాత్రి పోతన విజ్ఞాన పీఠంలో నాట్యమండలి అధ్యక్షుడు జీఎన్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శనలో సురభి హారిక, రేలారే శాలిని, జూలూరి నాగరాజు, సుధాకర్, అశోక్‌కుమార్, మధు, విజయారాజ్, సురేష్, లింగమూర్తి, రవికుమార్, శివ, సంగీతం సురభి నాగరాజు, లైటింగ్, సెట్టింగ్ సురభి సంతోష్ అందించారు. అనంతరం విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ రాజశేఖర్, ఎక్స్‌సోల్జర్ మనోజ్ ప్రభాకర్, బిట్ల వేణుగోపాల్, సుబేదార్ మల్లేశాన్ని సన్మానించారు.

ముగిసిన కార్తీక్ అంత్యక్రియలు



కార్తీక్ (ఫైల్)

టేకుమట్ల : మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ కొలుగూరి కార్తీక్ (31) శనివారం రాత్రి ఉత్తరాఖండ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా, ఆర్మీ అధికారులు ఉత్తరాఖండ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కార్తీక్ పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో మండల కేంద్రానికి తరలించారు. మంగళవారం సాయంత్రం కొనసాగిన కార్తీక్ అంతమయాత్ర రాత్రి 9.30లకు ముగిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కడసారి వీడ్కోలు పలికి కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, కార్తీక్ పార్థివదేహం మండల కేంద్రానికి చేరుకోగానే భార్య ప్రవళిక బంధువులతో కార్తీక్ కుటుంబ సభ్యులకు గొడవ మొదలైంది. ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

ఉత్తములకు ప్రశంస పత్రాలు



చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాస్

హనుమకొండ జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పలు శాఖల ఉద్యోగులు, అధికారులకు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం ప్రశంస పత్రాలు అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తాపట్నాయక్, సీపీ రంగనాథ్, తదితరులు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు.
- వరంగల్ క్రైం



సాంబశివరావు, డీఎంహెచ్ఓ | జి. రాంరెడ్డి, డీడీ, బీసీ వెల్ఫేర్ | హర్షవర్ధన్, డీఈఈ, ఇరిగేషన్ | డాక్టర్ కాళీప్రసాద్, గార్డియన్ ఆస్పత్రి



శేషుమాధవ్, కృష్ణ పీడియాట్రిక్ ఆస్పత్రి | దిలీప్‌కుమార్, కీర్తి చిల్డ్రన్ హాస్పిటల్ | డాక్టర్ జి. నరేందర్, సోషల్ వర్కర్ | సంతోష్, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | కె.శంకర్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | అమరేందర్, సీసీ, అడిషనల్ కలెక్టర్ | సీహెచ్ రాము, డ్రైవర్, కలెక్టరేట్ | ఎస్.ప్రసాద్, ఆఫీస్ సబార్డినేట్, కలెక్టరేట్ | సదయ్య, తోటమాలి | ఓం ప్రసాద్, ఆఫీస్ సబార్డినేట్, అడిషనల్ కలెక్టర్ | ఆర్.శేఖర్, ఆఫీస్ సబార్డినేట్, ఆర్డీవో హనుమకొండ | దశరథరాంరెడ్డి, గిర్దావర్, కాజీపేట



ప్రశాంత్, టైపిస్ట్, కమలాపూర్ | డాక్టర్ శ్రీధర్, బాలాజీ హాస్పిటల్ | ఆయుబ్ అలీ,పీఆర్ఓ, జీడబ్ల్యూఎంసీ | సంగీత, సీనియర్ అసిస్టెంట్, ఈఎస్ఐ హాస్పిటల్ | ఎస్.కె యాకూబ్ అలీ, ఎంఎన్ఓ, ఈఎస్ఐ హాస్పిటల్ | దిలీప్, మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | ఎ.రాజ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్, టీఎస్ఎన్పీడీసీఎల్ | ఆర్.అశోక్‌రెడ్డి, పైలట్, 108 | భిక్షపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్, క్వాలిటీ కంట్రోల్ బోర్డు | రమేష్, బ్యాడ్మింటన్ కోచ్, డీవైఎస్ఓ | ఎండీ అఫ్జల్, క్రికెట్ కోచ్, డీవైఎస్ఓ | కంచి వేణు,ఎంవీఐ, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్



నరేందర్, కానిస్టేబుల్, ట్రాన్స్‌పోర్ట్, డిపార్ట్‌మెంట్ | ఎండీ ఇక్బాల్ అహ్మద్, టైపిస్ట్ | నాగరాజు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, హనుమకొండ | మొగిలి, ఎనిమల్ కీపర్, అటవీశాఖ | అస్నాల శ్రీనివాస్, ప్రిన్సిపాల్, జీజేసీ | నవీన్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ | డి.సుదర్శన్, ఏఎస్సై, ఇంటెలిజెన్స్ | ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ,ఆత్మకూరు | యుగేంధర్, డ్రైవర్, ఎంపీపీ పరకాల | జి.పల్లవి, ఎంపీడీఓ, కమలాపూర్ | టి.రామస్వామి, రిటైర్డ్ పోలీస్ | ఎం.మధుమతి, ఎంపీపీ, ఐనవోలు



వెంకటరమణమ్మ, ఎంపీడీఓ, ఐనవోలు | గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టు | సోమ మధుకర్, సోషల్ వర్కర్ | శారద, సూపరింటెండెంట్, డీఈఓ కార్యాలయం | కంజర్ల మనోజ్, సోషల్ వర్కర్ | ఎస్.అఫ్జల్, డ్రైవర్, జీడబ్ల్యూఎంసీ | ఎం.ప్రకాష్, సోషల్ వర్కర్ | రవి, ఆఫీస్ సబార్డినేట్, డీపీఆర్ఓ | టి. ఆశ, టైపిస్ట్, ఐఅండ్‌పీఆర్ | ఎ.విజయలక్ష్మి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ | ఎ.దేవేందర్, ఇన్‌స్పెక్టర్, టాస్క్‌ఫోర్స్ | బి.శరత్‌కుమార్, ఆర్ఎస్సై

పాముకాటుతో యువకుడి మృతి

● ఇబ్రహీంపూర్‌లో ఘటన



మహేష్ (ఫైల్)

రఘునాథపల్లి: పాము కాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దొరగొల్ల ఎల్లయ్య, లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు మహేష్ (27), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులకు చేదోడువాడుగా ఉండే మహేష్ మంగళవారం గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. గ్రామ పెద్ద చెరువు కట్ట చివరన గొర్రెలను మేపుతుండగా మహేష్‌కు పాము కాటువేసింది. తనకు పాము కాటువేసినట్లు స్నేహితులకు ఫోన్ చేసి తెలిపాడు. ఘటనా స్థలిలోనే అస్వస్థతకు గురైన మహేష్‌ను స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా, అందరితో కలివిడిగా ఉండే మహేష్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మధుకర్ మృతదేహం

ఎల్కతుర్తి : అప్పులు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గోపాల్‌పూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన పెండ్యాల మధుకర్ (35) వ్యవసాయం, కుటుంబ అవసరాల నేపథ్యంలో విరివిగా అప్పులు చేశాడు. ఎలా తీర్చాలని కొంత కాలంగా మదనపడుతున్నాడు. ఈ విషయమై సోమవారం సాయంత్రం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మధుకర్ వ్యవసాయ పొలం వద్ద మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు.

పంద్రాగస్టు స్పెషల్ టిఫిన్

● త్రివర్ణ ఇడ్లీ..పూరీ

పరకాల: ఒక్కొక్కరు ఒక్కో రకమైన దేశాభిమానం ప్రదర్శిస్తుంటారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని శ్రీరామ ఉడిపి హోటల్ యాజమాని జాతీయ పతాకాలు, బెలూన్లతో అలంకరించడంతోపాటు మూడు రంగుల ఇండ్లీ..పూరీలతో కస్టమర్లను ఆకట్టుకున్నాడు. పంద్రాగస్టు స్పెషల్ టిఫిన్ అంటూ కస్టమర్లు హాయిగా తినేశారు.



ఉడిపి హోటల్‌లోని త్రివర్ణ ఇడ్లీ

మూడు రంగుల్లో పూరీ

చిన్నారిని ఢీకొన్న కారు

● పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన నందిని

గూడూరు: జాతీయ రహదారి దాటుతున్న ఓ చిన్నారిని కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆ బాలిక పరిస్థితి విషమంగా మారింది. మండలంలోని మర్రిమిట్టకు చెందిన చింత నర్సయ్య, హేమలత దంపతుల కూతురు నందిని ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది. మధ్యాహ్నం సమయంలో ఎస్‌హెచ్‌కు పక్కన ఉన్న పాఠశాల నుంచి రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో నర్సంపేట వైపు నుంచి వస్తున్న భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన కారు బాలికను ఢీకొంది. దీంతో గ్రామస్తులు వెంటనే బాలికను వరంగల్‌లోని ఓ ఆసత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కారుతో పాటు అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

సమాజహితానికి కవులు కృషి చేయాలి

● డాక్టర్ అంపశయ్య నవీన్



కవి సమ్మేళనంలో పాల్గొన్న అంపశయ్య నవీన్

హన్మకొండ కల్చరల్ : సమాజహితానికి కవులు కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. మంగళవారం హనుమకొండ పద్మాక్షి దేవాలయం రోడ్‌లోని డాక్టర్ జగదీష్‌బాబు ఆస్పత్రి సమావేశపు హాల్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మతసామరస్యం, జాతీయ సమైక్యతకు ప్రతీకగా గంగా, జమునా, తెహజీబ్ పేరుతో కవిసమ్మేళనం, ముషాయిరా నిర్వహించారు. వరల్డ్ పీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 40 మంది కవులు పాల్గొని కవితాగానం చేశారు. అనంతరం నిర్వాహకులు సిరాజుద్దీన్, రవికుమార్ కవులను సన్మానించారు. సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

కోర్టులో జెండావందనం..



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, పాల్గొన్న న్యాయమూర్తులు, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు. -వరంగల్ లీగల్



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వరంగల్ జిల్లా న్యాయమూర్తి కె.రాధాదేవి, న్యాయమూర్తులు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, కార్యదర్శి యాకస్వామి, సిబ్బంది తదితరులు.

'తూర్పు' నుంచి గణేశ్‌కు అవకాశం కల్పించాలి

● మంత్రి కేటీఆర్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘాల నాయకులు



మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

రామన్నపేట/హన్మకొండ: వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వద్దిరాజు గణేష్‌కు ప్రాతినిథ్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమ శాఖ మంత్రి కేటీఆర్‌కు బ్రాహ్మణ సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్‌ను బ్రాహ్మణ సంఘాల నాయకులు కలిశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి రాజకీయపరంగా సముచిత స్థానం కల్పించాలని, బీఆర్ఎస్ పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ, వరంగల్ జిల్లాలో బ్రాహ్మణ జాతిని ఏకతాటి పై తీసుకువచ్చిన వద్దిరాజు గణేష్‌కు వరంగల్ తూర్పు టికెట్ కేటాయించాలని కోరారు. సీఎం కేసీఆర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగు ఉపేంద్రశర్మ, జగన్‌మోహన్ శర్మ, లక్ష్మణ్ శర్మ, వెంకటేశ్వరరావు, సత్యమోహన్, శ్రీనివాసాచారి, పి.శ్రీనివాసరావు, శ్రీకాంత్, శరత్, శిరీష్, నాగేందర్, జయప్రసాద్ రావు, శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం..

● శిల్పాల ప్రాంగణంలో ఎగరని జాతీయ జెండా
● పర్యాటకుల అసహనం



మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో బోసిపోయి కనిపిస్తున్న స్తంభం

ఖిలా వరంగల్ : కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖిలావరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని స్తంభం వెలవెలబోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్తంభంపై స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరలేదు. కేవలం రాతి కోట ఉత్తర ద్వారా సమీపంలోని కోట బురుజుపై పురావస్తుశాఖ అధికారి తాత్కాలిక జెండా చేతపట్టి ఫొటోలు దిగారని పలువురు జాతీయవాదులు ఆరోపిస్తున్నారు. కాగా, మంగళవారం వరంగల్ ఉమ్మడి జిల్లాతోపాటు దేశ, విదేశీయులు పర్యాటకులు భారీ సంఖ్యలో చేరుకోగా బోసిపోయి కనిపించిన ఎత్తయిన జెండా స్తంభాన్ని చూసిన వారు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర పురావస్తుశాఖ.. రాష్ట్ర సూపరిండెంటెంట్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

ఎంజీఎం : వైద్య ఆరోగ్యశాఖలో 20 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయాల ఎదుట ఏఎన్ఎంలు సమ్మె ప్రారంభించారు. సమ్మెలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, యూరోపియన్ ఏఎన్ఎంలు, ఇతర అన్ని స్కీంలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు రెండు దశాబ్దాలుగా రెగ్యులర్ కాకుండా, సమాన పనికి సమాన వేతనం అమలు కాకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 31న కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. సమ్మెకు అన్ని ట్రేడ్, క్యాడర్ యూనియన్లు పద్ధతుగా నిలిచి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభావతి, సరోజ, నర్మద, విజయలక్ష్మి, రోజీ, వరలక్ష్మి, సునీత, విజయ, రజిత, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి ఎంపీపీ సునీతపై హత్యాయత్నం

హసన్‌పర్తి: హసన్‌పర్తి ఎంపీపీ కేతపాక సునీతపై హత్యాయత్నం జరిగింది. గ్రామానికి చెందిన సమీప బంధువు కోర్నేల్ ఆమెపై కత్తితో దాడికి యత్నించారు. మండలంలోని మల్లారెడ్డిపల్లిలో సోమవారం రాత్రి కోర్నేలు మేనకోడలు శారీ ఫంక్షన్‌జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కుటుంబీకులతో పాటు ఆమె బంధువులు కూడా వెళ్లారు. అయితే అక్కడ కోర్నేల్‌కు ఎంపీపీ బంధువుకు గొడవ జరిగింది. దీనిని అవమానకరంగా భావించిన కోర్నేలు తన కుటుంబసభ్యులతో కలిసి ఎంపీపీ ఇంటికి వచ్చి ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్యగొడవ జరిగింది. ఈ ఘటనలో కోర్నేలుకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎం తరలించారు. కాగా, ఎంపీపీ సునీతతో పాటు ఆమె భర్త రాజు మరో ఆరుగురు తనపై దాడి చేశారని కోర్నేల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, తనపై కత్తితో దాడి చేశారని కోర్నేల్‌తో పాటు మరో ఇద్దరిపై ఎంపీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.